క్లుప్తంగా

ముగిసిన ఉపవాస ప్రార్థనలు



విశ్వాసులకు బోధిస్తున్న సత్యానందం

పెద్దాపురం: క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో నిర్వహించిన ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగిశాయి. విరవ క్రీస్తు ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం అధ్యక్షతన పాస్టర్ ఆనందకుమార్, నవజీవన రావు, దైవ ప్రసంగాన్ని అందించారు. పాస్టర్లు, సీజీఎం వ్యవస్థాకుడు నంగిన శామ్యూల్ సుదీప్, వంకా జాన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలు



వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ తదితరులు

పెద్దాపురం: మండలంలోని మర్లావ గ్రామంలో వలంటీర్లకు శుక్రవారం సేవా పురస్కారాలను అందజేశారు. ప్రభుత్వ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. అనంతరం గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళితో పాటుగా వారు వలంటీర్లకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కామన రామకృష్ణ, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, పంచాయతీ కార్యదర్శి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎగసి పడుతున్న అలలు



కోతకు గురవుతున్న బీచ్ రోడ్డు

కొత్తపల్లి: తుపాన్ హెచ్చరికలు లేనప్పటికీ సముద్రంలో అలల ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. స్థానిక తీరప్రాంతం, బీచ్‌రోడ్డు కోతకు గురవుతోంది. తీరప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కెరటాలు ఎగసి పడుతుండటంతో కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్డులో వాహన రాకపోకలను పోలీసులు నిలిపివేశారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

కాకినాడ కల్చరల్: అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ చేస్తున్న కళారంగ సేవలు అభినందనీయమని సంఘసేవకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.శుభశేఖర్ అన్నారు. స్థానిక సూర్యకళా మందిర్‌లో పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటికల పోటీల్లో భాగంగా శుక్రవారం ముందుగా తిరుపతికి చెందిన శ్రీశృంగార వల్లభ ఆర్ట్స్ సమర్పణలో కె.బ్రహ్మానందం దర్శకత్వంలో 'కబ్జా' నాటిక ప్రదర్శించారు. అనంతరం తాడేపల్లికి అరవింద ఆర్ట్స్ వారు గంగోత్రి సాయి దర్శకత్వంలో 'మనస్విని' నాటికను, విశాఖకు చెందిన ఉక్కు కళా ప్రవంతి సమర్పణలో డి.సత్యనారాయణ దర్శకత్వంలో 'అమ్మ .. మారిపోయింది' నాటికలను ప్రదర్శించారు. డాక్టర్ ఎస్.మాధురి, పరిషత్ అధ్యక్షులు కర్రి అచ్యుతరామారెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు, మురళి, జానకిరామ్‌చౌదరి పాల్గొన్నారు.

● కళకళలాడిన సాగరతీరం



మత్స్య సంపదను తీరానికి చేర్చుతున్న మత్స్యకారులు

కొత్తపల్లి: అమీనాబాద్, ఉప్పాడ సాగర తీరం చేపల క్రయ విక్రయాలతో శుక్రవారం కళకళలాడింది. మత్స్యకారులకు కాకి కవళ్లతో పాటు పలు రకాల చేపలు చిక్కాయి. ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట గ్రామాల నుంచి సుమారు 80 బోట్లపై మత్స్యకారులు వేటకు వెళ్లారు. ఈ ఒక్క రోజే మత్స్యకారుల వలలకు సుమారు రూ.90 లక్షల విలువైన 90 టన్నుల మత్స్య సంపద లభించిందని చెబుతున్నారు. కొన్ని బోట్లకు రెండు మూడు టన్నుల వరకూ కూడా మత్స్య సంపద (కాణా గొరస) చిక్కడం విశేషం. ఇక్కడి నుంచి ఈ చేపలను కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.



చేపల వేలం నిర్వహిస్తున్న వ్యాపారులు

గ్రామ సేవాలయాలు

- సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన
- పైసా ఖర్చు లేకుండా సేవలు
- భూమి రిజిస్ట్రేషన్లకూ అవకాశం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పిఠాపురం మండల వివరాలు

గ్రామ పంచాయతీలు - 24
సచివాలయాలు- 25
వలంటీర్లు - 477 మంది
సచివాలయ సిబ్బంది -219 మంది
వివిధ పథకాల లబ్ధిదారులు - 11,135



కొండెవరం గ్రామ సచివాలయం

పిఠాపురం: మహాత్మ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. గ్రామీణులు మండల కేంద్రంలో ఉండే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉన్న ఊరులోనే ప్రభుత్వ సేవలను అందించేందుకు 2020 జనవరి 26న గ్రామ సచివాలయాల్లో వివిధ సేవలకు శ్రీకారం చుట్టారు. ఒక్కొక్క సచివాలయంలో పంచాయతీ రాజ్, రెవెన్యూ, భూ సర్వే, ఇంజనీరింగ్, విద్యుత్, వ్యవసాయం, ఉద్యాన, సెరీకల్చర్, వైద్యం, తదితర శాఖలకు చెందిన సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం సచివాలయాల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఐదు వందలకుపైగా సేవలు అందిస్తున్నారు. ఇంతటి బృహత్తర సేవలు అందిస్తున్న సచివాలయాలకు సొంత భవనాలను సైతం సమకూర్చుతున్నారు. ప్రజల తలుపుతట్టి సేవలు అందించేందుకు సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లను నియమించారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆయా గృహస్తులకు అవసరమైన సర్టిఫికెట్లకు దరఖాస్తులు స్వీకరించడం, గడువులోగా సర్టిఫికెట్లను మంజూరు చేయించి అర్హులకు అందిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఇప్పటికే పలు గ్రామాల్లో సచివాలయాలు సిద్ధం కాగా కొన్ని చోట్ల నూతన సచివాలయాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

కొత్తగా భూముల రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లో నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆ ప్రక్రియను ప్రారంభించారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 540 రకాల సేవలను సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు తీసుకువచ్చింది. ఉన్న ఊరిలోనే అన్ని రకాల సేవలు అందడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది, వారి విధుల వివరాలు

1. పంచాయతీ కార్యదర్శి - గ్రామ సచివాలయ కన్వీనర్, పన్నుల వసూలు, పారిశుద్ధ్యం, సంక్షేమ కార్యక్రమాలు (పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షణ)
2 వీఆర్వో- భూముల పర్యవేక్షణ, వ్యవహారాలు, పౌరసరఫరాలు (రెవెన్యూ శాఖ పర్యవేక్షణ)
3 సర్వే అసిస్టెంట్- భూముల సర్వే (రెవెన్యూ శాఖ, సర్వే డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణ)
4 ఏఎన్ఎం- ప్రజల ఆరోగ్య పరిరక్షణ (వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ)
5 వెటర్నరీ, ఫిషరీష్ అసిస్టెంట్- పశు వైద్యం, పాడి, మత్స్యశాఖ కార్యక్రమాలు (పశు సంవర్ధకశాఖ పర్యవేక్షణ)
6 మహిళా రక్షణ ఉద్యోగి/మహిళా పోలీసు- మహిళలకు కౌన్సెలింగ్, మహిళల రక్షణ (మహిళా శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణ)
7 ఇంజినీరింగ్ అసిస్టెంట్- మంచినీటి సరఫరా, ఇతర ఇంజినీరింగ్ పనులు (పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణ)
8 ఎలక్ట్రికల్ అసిస్టెంట్- విద్యుత్ సరఫరా, పర్యవేక్షణ, విద్యుత్ కనెక్షన్లు (పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షణ)
9 అగ్రి, హార్టీకల్చర్ ఎంపీఈఓలు- వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్ (అగ్రి కల్చర్ హార్టీ కల్చర్ విభాగం పర్యవేక్షణ)
10 డిజిటల్ అసిస్టెంట్- గ్రామ సచివాలయంలో సింగిల్ విండో సిస్టమ్ పర్యవేక్షణ (పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షణ)
11 వెల్ఫేర్ అసిస్టెంట్- పింఛన్ల పంపిణీ, పొదుపు సంఘాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు (సాంఘిక సంక్షేమ శాఖ పర్యవేక్షణ)

గంటల తరబడి వేచి ఉండే బాధ తప్పింది

గతంలో ఏ చిన్న పని అవసరమైనా పిఠాపురం వెళ్లాల్సి వచ్చేది. పనులు మానుకుని మగవారిని తోడు తీసుకుని వెళ్లి ప్రభుత్వ కార్యాలయాల వద్ద గంటల తరబడి నిలబడేవాళ్లం. దీంతో తీవ్ర వ్యయ ప్రయాశలు అయ్యేవి. ప్రస్తుతం మా ఊళ్లోనే, మా ఇంటి పక్కనే గ్రామ సచివాలయం ఏర్పాటు చేశారు. ఎవరి అవసరం లేకుండానే ఆడవారిమే వెళ్లి ఏపని అయినా చిటికెలో చేయించుకుంటున్నాం. ఎక్కువగా సచివాలయ సిబ్బందే మా వద్దకు వచ్చి పనులు చేస్తున్నారు. రూపాయి ఖర్చు లేకుండా పనులు అవుతున్నాయి. సచివాలయ వ్యవస్థ గ్రామీణ ప్రజలు ఓ వరంగా చెప్పవచ్చు. ప్రభుత్వం ఇటువంటి వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పాలన తీసుకురావడం ఒక సువర్ణాధ్యాయమే.



- యర్రా పార్వతి, పి.రాయవరం, పిఠాపురం మండలం

పేదలకు ఓ వరం

గతంలో చిన్న పని ఉన్నా ఒక రోజు కేటాయించవలసి వచ్చేది. ఇప్పుడు అలా కాదు అవసరం వస్తే వెంటనే గ్రామ సచివాలయానికి వెళితే చిటికెలో పని పూర్తవుతోంది. దరఖాస్తు చేసుకుంటే చాలు పని పూర్తయ్యాక గ్రామ సచివాలయ సిబ్బందే కబురు పంపుతున్నారు. అవసరమైతే వారే ఇంటికి వచ్చి సమాచారం సేకరిస్తున్నారు. సామాన్య కుటుంబాలకు గ్రామ సచివాలయాల వల్ల చాలా డబ్బు ఆదా అవుతోంది. ఏ విధమైన ఖర్చు లేకుండా అన్ని పనులు అవుతున్నాయి. సచివాలయ వ్యవస్థ పేదలకు ఓ వరం. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను పాదయాత్ర ద్వారా స్వయంగా తెలుసుకున్నారు కనుకనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మా కష్టాలు తీర్చారు.



- శీలి కుమారి, పి.రాయవరం, పిఠాపురం మండలం

చదువుతోనే గుర్తింపు

- హౌసింగ్ చైర్మన్ దవులూరి
- ఉండూరులో అమ్మఒడి ప్రారంభం



ఉండూరులో అమ్మఒడి నమూనా చెక్కు అందజేస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: చదువుతోనే ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందని రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకునే సీఎం జగన్ అమ్మఒడి, జగనన్న విద్యాకానుక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఉండూరు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, హెచ్ఎం వి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అధ్యక్షత వహిస్తూ మండల పరిధిలో తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.18.07 కోట్లు అమ్మ ఒడి పథకం నిధులు జమ చేశారన్నారు. ఈ మేరకు నమూనా చెక్కును దొరబాబు అందజేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, రెండో ఎంఈఓ పి.పుల్లయ్య, వైస్ ఎంపీపీలు పేర్నిడి వెంకట్రాయుడు, ములసా శ్రీను, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి సారె సమర్పణ

పిఠాపురం: ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అమ్మవారి దేవాలయాల్లో ఆషాఢ మాసం సారె సమర్పించాలని దేవదాయ ధర్మదాయ శాఖ నిర్ణయించింది. పిఠాపురం పురుహూతిక అమ్మవారికి ఆషాఢమాస సారెను శనివారం సమర్పించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వులు వచ్చాయని పాదగయ ఈఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా క్షేత్రంలోని పురుహూతిక అమ్మవారికి సారె సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దొరబాబు



సామర్లకోటలో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులు



గొర్సలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెద్దాపురం: ప్రజావసరాలు గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా జగనన్న సురక్షకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర హౌసింగ్‌బోర్డు చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పెద్దాపురం, సామర్లకోట ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందించడమే గాక ప్రజలకు అవసరమైన పౌర సేవలను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరావు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి అన్నారు. మండలంలోని మర్లావ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఈఓపీఆర్డీ మూర్తి పంచాయతీ కార్యదర్శి నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు కామన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు మేలు

కొత్తపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ తెలిపారు. గొర్స, ఉప్పాడ సచివాలయం-3లలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. కోవిడ్ సమయంలోనూ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో సర్టిఫికెట్లు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని అన్నారు. గ్రామ సర్పంచులు రొంగళ వీరబాబు, ఉమ్మిడి మేరీ, మండల ప్రత్యేకాధికారి పుష్పామణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: స్థానిక నాలుగో సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ముఖ్య అతిథిగా హాజరై దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్‌చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమమే లక్ష్యం

- హౌసింగ్ చైర్మన్ దొరబాబు
- పెద్దాపురంలో గడప గడపకూ..

పెద్దాపురం : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ చైర్మన్ దొరబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రెండో సచివాలయం పరిధిలో 3, 28, 29 వార్డు పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకూ తిరిగి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు గడపా రామలక్ష్మి, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులతో పాటు ఎంపీటీసీలు శైల గణేష్, రాయి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు పథకాల గురించి వివరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

గోకివాడలో సాగునీటి వివాదం

పిఠాపురం: పంట కాలువపై అక్రమంగా ఏర్పాటు చేసిన ఇనుప చక్రాలు తొలగించడానికి అధికారులు తీసుకున్న నిర్ణయంపై పిఠాపురం మండలం గోకివాడలో రైతులు ఆందోళనకు దిగారు. ఇటీవల రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు, జములపల్లి, పి.రాయవరం గ్రామాలకు చెందిన రైతులు తమ పంట పొలాలకు రివాజుగా రావాల్సిన నీటిని రానీయకుండా కొందరు రైతులు గోకివాడ వద్ద పుట్టకొండయ్య కాలువపై అక్రమంగా ఇనుప చక్రాలు అమర్చారని పిఠాపురం తహసీల్దార్ త్రినాథరావుకు వినతి పత్రం అందజేశారు. దీంతో తమ పంట పొలాలకు సక్రమంగా నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ జరిపి గోకివాడలో కాలువపై నిర్మించిన ఇనుప చక్రాలను తొలగించడానికి నిర్ణయం తీసుకున్నారు. దీంతో గోకివాడలో రైతులు శుక్రవారం కాలువ వద్ద ఆందోళన నిర్వహించారు. చక్రాలు తొలగిస్తే క్రాప్ హాలీడే ప్రకటిస్తామంటూ హెచ్చరించారు. దీనిపై అధికారులు రైతులతో చర్చలు జరిపారు.



గోకివాడలో ఆందోళన చేస్తున్న రైతులు

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత సంక్షేమం పరుగులు పెట్టిందన్నారు. అర్హత ఉండి పథకాలు అందుకోని వారికి కచ్చితంగా అందించాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం రూపొందించారన్నారు. చేబ్రోలులో ప్రజలకు నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకూ రూ.44.39 కోట్లు వివిధ పథకాల ద్వారా అందజేశారన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్య లేకుండా చేయడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ.28 లక్షల చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో విశేష కృషి చేసిన వలంటీర్లను ఆయన సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగ లోవరాజు, ప్రత్యేకాధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



చిత్రాడలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

నిర్లక్ష్యానికి మూల్యం



- తూటేరు పూడికతో మునిగిన పొలాలు
- నిధులు మంజూరై మూడు నెలలు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాత

సామర్లకోట: వీకే రాయపురంలోని పంట భూములు చెరువులుగా మారి పోయాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వాననీరు సముద్రంలోనికి పోవాల్సి ఉండగా తూటేరు డ్రైను పూడికతో పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఎనిమిదేళ్లుగా డ్రైనులో పూడిక తీయకపోవడంతో రైతులకు ఏటా తిప్పలు తప్పడం లేదు. 'సాక్షి' ప్రచురించిన కథనాలకు కలెక్టర్ కృతికా శుక్లా మూడు నెలల క్రితం నిధులు మంజూరు చేశారు. అయినప్పటికీ అధికారులు పనులు మొదలు పెట్టకపోవడంతో గ్రామంలోని సుమారు 800 ఎకరాలు మునిగిపోతున్నాయని రైతు సంఘ నాయకులు కుర్రా శ్రీనివాసరావు, వెలమర్తి శ్రీనివాసు, ఇంటి రమేష్‌లు తెలిపారు. పంటల ముంపు వల్ల ఇప్పటికే రెండు పర్యాయాలు పంట బీమా వచ్చిందని, మూడో పర్యాయం వస్తుందనే నమ్మకం లేదని రైతులు తెలిపారు.